28102023-DIS-06_Layout 1 10/28/2023 1:52 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## విన్నపం

### కేంద్రం చర్యలు తీసుకోవాలె

పదవీ విరమణ చేసిన సింగరేణి ఉద్యోగులకు రెండు దశాబ్దాలకు పైగా పింఛన్‌ను సవరించకపోవడంతో వారు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీంతో సింగరేణి ఉద్యోగులు తమ విచారకరమైన స్థితిని తెలియజేస్తూ 2023, ఆగస్టు 30న రాష్ట్రపతి భవన్‌కు ఈ-మెయిల్ ద్వారా వినతిపత్రాన్ని పంపించారు. దీనికి ప్రతిగా.. పింఛన్ పెంపునకు నిధులు సరిపోవడం లేదని, ఈ విషయం బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ పరిశీలనలో ఉన్నదని కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ అధికారులు తెలిపారు. ఇప్పుడే కాదు, సింగరేణి ఉద్యోగులు వినతిపత్రాన్ని సమర్పించినప్పుడల్లా అధికారుల నుంచి ఇటువంటి సమాధానమే వస్తుండటం విచారకరం. పదవీ విరమణ చేసిన సింగరేణి ఉద్యోగులు తక్కువ మొత్తాలతో బతుకులను ఎల్లదీస్తున్నారు. వారికి వచ్చే పింఛన్ ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడానికి కూడా సరిపోవడం లేదు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు ఒంటరిగా జీవిస్తున్నట్టుగా భావిస్తుండటం సిగ్గుచేటు. వీరి దుర్భర పరిస్థితిని గురించి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరం. కోల్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ పెంపుదల కోసం దేశంలోని వివిధ పింఛన్ సంఘాలు ఇటీవల కోల్ సెక్రటరీ, కోల్ ఇండియా చైర్మన్‌కు విజ్ఞప్తి లేఖలు అందించగా వారు సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తున్నది. ఇది ఆహ్వానించదగిన పరిణామం. ఏదేమైనప్పటికీ సింగరేణి ఉద్యోగుల క్లిష్ట పరిస్థితులను పరిశీలించి, గౌరవప్రదంగా జీవించేలా వారి పింఛన్‌ను తగినరీతిలో పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.

- ఆళవందార్ వేణుమాధవ్



### ఇదీ.. బీజేపీ నిజ స్వరూపం!

మధ్యప్రదేశ్ హోం మంత్రి తన నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ సొంత పార్టీకి చెందిన మహిళా ఎంపీని లక్ష్యంగా చేసుకొన్నారు. హేమామాలిని డ్యాన్స్ చేసేలా అభివృద్ధి చేశామన్నారు. కానీ మోదీ మాత్రం అన్నిచోట్లకు వెళ్లి 'నారీ శక్తి' పేరిట ఓట్లడుగుతారు. ఇదీ ఆయన పార్టీ నిజ స్వరూపం.

- సాకేత్ గోఖలే
తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ

కన్నారం తీగెల వంతెన గురించి గత రెండు మూడ్రోజులుగా సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన చర్చ జరుగుతున్నది. ఆ వంతెన రేపో, మాపో ఇగి కూలిపోతుంది సూడుండ్రి అనే రేంజ్‌లో కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు రాస్తూ, వీడియోలు షేర్ చేస్తూ తమ పైశాచికానందాన్ని పొందుతున్నారు. సోషల్ మీడియా రాతలను జూసి కొన్ని పత్రికలూ వార్తలను వండి వారుస్తుండటం విడ్డూరం. ఇంతకూ కన్నారం వంతెనపై జరిగిందేమిటని ఆరాదీస్తే...

సలికాలం గూడ ఎండకాలం లెక్క ఎండలు ఇర్గ కొడుతుండటంతో ఓ పది మీటర్ల మేర డాంబర్ మెత్తగై ముద్దగట్టింది. అంతే.. ఇక నక్కకు బొక్క దొరికినట్టు కేబుల్ వంతెనకు ఉయ్యాల గట్టుకొని మరీ కొందరు వ్యక్తులు ఆహా.. ఓహో అంటూ తెగ ఊగిపోతున్నారు. అయినా వారి సంబురాన్ని మనం ఎందుకు అడ్డుకోవాలి? వాళ్లట్లా ఊగుతూ ఉండగానే మనం ఓ సారి గతాన్ని నెమరేసుకుందాం...

# నేటి తీగెల వంతెన.. నాటి యాది



గడ్డం సతీష్
99590 59041



***

**2004,** మే అనుకుంటా.. నేను ఓ పూట డిగ్రీ ఫస్టియర్ సదువుకుంటనే.. ఇంకో పూట శ్రీగ్రాఫిక్స్ ప్రింటింగ్ ప్రెస్‌ల పన్జేస్తున్న రోజులు. నాతో పాటు అదే ప్రెస్‌లో పన్జేస్తడు మహమ్మద్ సర్వర్ పాషా భాయ్. 'సతీషన్న మా అక్క పెండ్లి ఉందే, నువ్వూ, నీ దోస్తులందరు తప్పకుండా రావాల్నని' పిలిస్తే... నేను, ఓ నలుగురైదుగురు సోపతిగాండ్లం గల్సి సర్వర్ వాళ్లక్క పెండ్లికి వోయినం. తురుకోళ్ల పెండ్లికి వోవుడంటే మాకు మస్తిష్టం. ఎందుకంటే చికెన్ బిర్యానీ, మటన్ కూర, కాళ్ల షోర్వా, ఖద్దూ కీర్, డబల్ కా మీఠా.. సిస్టమ్యాటిక్‌గా కూసుండవెట్టి తీరొక్క తీరు కూరలు వెడ్తరని మాకప్పటికే తెల్సు కావట్టి.

పెండ్లయిపోయింది. కడుపు నిండా అన్నం దినంక దోస్తులందరం ముచ్చట్లల్ల వడ్డం. ఆ ముచ్చట్లల్ల మాకు టైం ఏర్పల్లే. 'పన్నెండైతంది, ఇగింటికి వోవుడద్దారా... ఇక్కన్నే పడుకుందామా శెప్పుండ్రి మరి' అని మా నత్తోడు కారడ్డ మాడితే గానీ మేం గడియారం మొకాన సూల్లే. మేం కన్నారంలోని ఎన్.ఎన్.గార్డెన్ నుంచి మానకొండూరుకు పోవాలె. అద్దుమనాత్రి పన్నెండు గొడ్తున్నది. ఒక్క ఆటో కన్పిస్తలేదు. ఆటోల కోసం ఓ ముప్పావుగంటదాన్క సూసేసరికి దగ్గెర దగ్గెర టైం ఒక్కటి గావొస్తున్నది.

'ఇగిట్లనే సూస్కుంటా ఉంటే ఇక్కన్నే తెల్లార్తది. మెల్లగ వాగు (అంటే... ఇప్పుడు కొత్తగైన కేబుల్ వంతెన కిందికెల్లి లోయర్ మానేరు వాగు వోతది)లకెల్లి నడ్సుకుంట వోదామారా' అని మా గుంపులకెల్లి నల్లోడు అడుగవట్టిండు.

ఎన్.ఎన్.గార్డెన్ నుంచి హౌజింగ్ బోర్డు చౌరస్తా, వాగ్గడ్డ నుంచి సదాశివపల్లె రోడ్డెక్కేదాన్క శ్మశాన వాటిక మొదలు దాదాపు ఐదారు కిలోమీటర్ల దాన్క తొవ్వపొంటి మొత్తం తుమ్మ శెట్లు, జపాన్ శెట్లే ఉంటయి. ఆ రోడ్డు మీన ఈనంగా ఒక్క ఆటోవోతే ఎదురుంగా ఏమొచ్చినా అది ఇటు మొకానొచ్చుడు బహుకట్టం. అందునా ఆ మట్టి రోడ్డు మొత్తం శిమ్మశీకటే ఉంటది.

'ఛల్.. అవసరం ఉంటే ఇక్కన్నే పండుకుంట గనీ నేనైతే వాగులకెల్లి రానన్నా.. వాగు మొత్తం శిమ్మశీకటి ఉంటది. అక్కడన్ని దయ్యాలు తిరుగుతయటా..' అని శిరంజీవిగాడు మొకమంతా శిన్నగా జేసుకున్నడు. వాని భయాన్ని పసిగట్టిన దోస్తుగాళ్లందరూ 'ఛల్ ఇయ్యాళ్ల మనం వాగులకెల్లి పోయినోళ్లమే గావాల్న'ని మంకుపట్టు వట్టిన్రు. పాపం శిరంజీవిగానికి నలుగురుతోని నారాయణా అనుడు తప్పలేదు.


మా తొవ్వ హౌజింగ్‌బోర్డు కరెంటు సబ్‌స్టేషన్ నుంచి వయా వాగ్గడ్డ.. మానకొండూరుకు సాగుతున్నది. సచ్చిపోయిన బర్లు, గొడ్లు, ఎడ్లు, కోళ్ల కాళ్లు, పేగుల కాన్నుంచి మొత్తం పారేసినట్టున్నరు. బైపాస్ (ఇప్పుడున్న కొత్త వంతెన వద్దకు)కు వోంగనే ముక్కుపుటాలు పలిగిపోయే వాసన గొడ్తున్నది. ఈ వాసనకు సర్వర్ భాయ్ వెట్టిన బిర్యానీ రుచి నాలిక మీంచే ఎప్పుడో వోయింది. మా గుంపులున్న డబ్బా గాడు వొయి 'వ్యాక్.. వ్యాక్..' అని పేగులన్ని బైటవడేటట్టు కక్కుతున్నడు. ఇగ చిరంజీవిగానికి సందు దొర్కింది. 'ఇప్పటికైనా నా మాటినుండ్రి. ఇట్లకెల్లి ఇటే వాపస్ పోదాం పార్రి' అని మొత్తుకునుడు షురూ జేసిండు.

'ఏ గీ సగం బడా అచ్చినంక మళ్లా వాపస్ పోదామారా బై.. ముక్కు మూసుకోండ్రి మెల్లగ వాగు దాటితే ఐపాయె' అని నేననుడుతోనే 'ఔ.. ఔ నువ్వద్దెరా' అని తతిమా దోస్తులన్నరు. అందరం ముక్కులకు దస్తీలు కట్టుకున్నం. 'ఎన్.ఎన్.గార్డెన్ల శెయ్యి గడుక్కొని దస్తీలకు తుడ్సుకున్నం గదా బిర్యానీ వాసన ఒక్కసారి ముక్కులకు సొచ్చుకపోయింది'. ఎవ్వలి వాసనను వాళ్లే మళ్లోపారి ఆస్వాదిస్తున్నరు. వాగ్గడ్డకు ఇట్ల సొచ్చినమో లేదో.. ఓ రెండు నిమిషాలైనంక ఆకాశంల మంటలు మస్తుగా డ్యాన్సు జేస్తున్నయి. ఆ మంటలను జూసిన శిరంజీవిగాడు జెప్పన నా శెయ్యందుకున్నడు. 'ఏం భయపడకురా' అని నేనంటే కిందికెల్లి మీది దాన్క జూసుకుంటా ఏదో మాట్లాడుదామనుకుంటున్నడు వాడు, గనీ భయానికి వాని నోట్లెకెల్లి గూతెల్తలేదు. వాగు రానే అచ్చె.. ఓ రెండు వందల మీటర్ల వెడల్పున వాగువోతంది గనీ అప్పుడు గిన్ని నీళ్లెక్కడియి? నీళ్లుంటే మేం వాగులకెల్లి ఎందుకు వోయేటోళ్లం? అరికాళ్లు మునిగి మొకాళ్ల కిందికి నానినయి కాళ్లు. వాగుల సగం బడా వోయినంక శిరంజీవిగాడు ఒక్కటేసారి ఎగిరి దున్కిండు. 'ఏమైందిరా' అనడిగితే వాడు ఏడ్సుడే తక్కువ. ఎవ్వలో సచ్చిన బర్రె వారేసినట్టున్నరు వాగుల. దాని తోక మావోనికి తాకింది. అటో.. ఇటో.. మెల్లగ అందరం వాగు దాటినం. ఇంకో రెండు కిలోమీటర్లు వోతే వరంగల్ హైవే రోడ్డెక్కుతం. గనీ, అప్పుడే మేమందరం శిమ్మశీకట్లకు వోతున్నం. రోడ్డు పొంటి అటూ ఇటూ జపాన్ శెట్లు, తుమ్మ శెట్లు గుడిసె కప్పినట్టున్నయి. ఎదురుంగా ఉన్నోని మొకమే కనవడ్తలేదు. కనీ, అంతదూరాన తెల్లగా ఏదో మెరుస్తున్నది. మెరవడమే కాదు గల గల సప్పుడు కూడా జేస్తున్నది. నడుస్తున్నా కొద్దీ దగ్గరికి పిల్సినట్టే ఇనవడ్తున్నది ఆ సప్పుడు. మా అందరికీ అది కనవడ్తున్నది గనీ, ఎవ్వలకెవ్వలం శెప్పుకుంటలేం. ఓ పదిహేను నిమిషాలు నడిస్తే కానీ రోడ్డు రాదు. రోడ్డెక్కితే గానీ మోటర్ల అలికిడి ఇనవడది. ఎట్లయినా ఇయ్యాళ్ల ఇల్లు చేరుతమనే భరోసానే మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నది. ఆ రోజు మేం ఇంటికి వోయినమా, మా శిరంజీవి గానికి తెల్లారి ఏమైందో తర్వాత తెల్సుకుందాం...

***

ఎట్లుండె వాగు ఇప్పుడెట్లయిందో నాడు సూసినోళ్లు ఇప్పుడు జూస్తెనే అర్థమైతది. వాగు మీద తీగల వంతెన వడ్డది. వాగ్గడ్డకు సకల సదుపాయాలతో వైకుంఠధామం ఏర్పడ్డది. ఇరుకు రోడ్లున్న కన్నారంల ఇన్నర్ రోడ్లు ఎంత మంచిగైనయో నాటి దుస్థితిని, నేటి అభ్యున్నతిని స్వయంగా అనుభవించినోళ్లకే తెలుస్తది. ఎట్లుండె హౌజింగ్‌బోర్డు కాలనీ ఇప్పుడెట్లయింది? కన్నారంల ఎన్ని పార్కులుండె, ఇప్పుడెన్ని పార్కులైనయి. కన్నారంల తీగెల వంతెన ఏర్పాటైతదని అసలు ఊహించినమా?

అసొంటిది ఇయ్యాళ్ల కన్నారం తీగెల వంతెన మీన నాత్రంతా లైట్లు డ్యాన్స్ జేస్తున్నయి. కన్నారం నుంచి మా మానకొండూరుకు నిమిషాలల్ల జేరుతున్నం. వాగులకెల్లి ఉన్న మట్టి రోడ్డు, డాంబర్ రోడ్డయ్యింది. ఇక్కణ్నుంచి, అక్కడిదాన్క సెంటర్‌లైటింగ్ ఏర్పడ్డది. ఇదిట్లా ఉంటే ఒక్క కన్నారం తీగల వంతెన అనే కాదు, ప్రభుత్వం ఏ అభివృద్ధి పన్జేసినా తప్పులెన్నులాడేటోళ్లు ఉండనే ఉంటరు. వాళ్లు తెల్లకాయిదం మీద ఉన్న పెన్ను సుక్కనే సూత్తరు గనీ, తెల్ల కాయిదాన్ని సూడరు. తప్పు పెన్ను సుక్కదా, లేకుంటే వాళ్ల కండ్లదా? వాళ్లకు వాళ్లే ఓపారి ఇషారం జేస్కోవాలె?



కన్నారం తీగెల వంతెన ఏర్పడకముందు ఇదీ.. వాగు పరిస్థితి


# రైతుపై కనికరం లేని కాంగ్రెస్



రమేశ్ హజారి
93909 19090

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రైతాంగాన్ని పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ.. రైతులు బాగుపడుతుంటే చూడలేక కండ్లల్లో నిప్పులు పోసుకుంటున్నది. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించి ముఖ్యమంత్రిగా ఉద్యమ నాయకుడు కేసీఆర్ పగ్గాలు చేతపట్టి రైతుబాంధవుడిగా రైతుల ప్రయోజనం కోసం అనేక పథకాలకు శ్రీకారం చుట్టారు. వీటిని నిలిపివేసి రాష్ట్ర వ్యవసాయ రంగానికి, రైతాంగానికి నష్టం చేసేలా కనికరం లేని చర్యలకు కాంగ్రెస్ పాల్పడుతున్నది. రైతాంగానికి లాభం చేయాల్సిందిపోయి ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న రైతుల నోట్లో మట్టికొట్టాలనే కుట్రలకు కాంగ్రెస్ పార్టీ తెరతీసింది.

రైతుల పొలాలకు కేసీఆర్ ప్రభుత్వం ఉచితంగా 24 గంటలు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తుంటే మూడు గంటలు చాలంటూ తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడటం, భూముల బదలాయింపుపై రైతులకే హక్కు కల్పిస్తూ రూపొందించిన ధరణిని బంగాళాఖాతంలో విసిరివేస్తామని భవిష్యత్తులో పట్వారీ వ్యవస్థను తీసుకువస్తామని, రైతులకు నష్టం తెచ్చే కార్యక్రమాలు తెస్తామని బహిరంగంగానే కాంగ్రెస్ పార్టీ నాయకులు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కతోపాటు, ఇతర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పదేపదే చెప్పడం, బుధవారం రోజు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాణిక్‌రావు ఠాక్రే.. ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తూ రైతుబంధును నిలిపివేయాలని కోరడం.. కాంగ్రెస్ పార్టీకి రైతుల పట్ల ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నాయి.



నిరంతర ప్రక్రియగా ప్రతి సంవత్సరం రెండు సీజన్‌లలో వేసే రైతుబంధును ఎన్నికల పేరు చెప్పి నిలిపివేయాలని కుట్రలకు పూనుకోవడం కాంగ్రెస్ పార్టీ చిన్న, సన్నకారు రైతాంగ వ్యతిరేక ధోరణులకు అద్దం పడుతున్నది. తెలంగాణ ప్రగతిని ఆగంచేసే దిశగా ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపుల్లలు వేస్తున్న కాంగ్రెస్ నేడు తెలంగాణ సంక్షేమాన్ని అడ్డుకోజూస్తున్నది. ఇది వారి ఫక్తు రాజకీయ స్వార్థానికి అవకాశవాదం, మూర్ఖత్వానికి పరాకాష్ఠగా మారింది.

దేశంలో, రాష్ట్రంలో దాదాపు ఐదు దశాబ్దాలకు పైగా రాజ్యమేలిన కాంగ్రెస్ ఏనాడూ రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రపంచానికి పట్టెడన్నం పెట్టే రైతులే.. 'అన్నమో రామచంద్రా' అంటూ ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రైతుల పరిస్థితి కడు దయనీయం. సాగునీరు లేక, పంటలు పండక, ఆదుకునే ప్రభుత్వం లేక ఎందరో రైతులు ఊరు విడిచి వలస వెళ్లారు. బొంబాయి, దుబాయి, భీమండి, హైదరాబాద్‌తోపాటు దేశంలోని నలుమూలల పొట్టకూటి కోసం వెళ్లడం తెలిసిందే.

సాగునీటి రంగాన్ని బలోపేతం చేస్తూ రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలుచేస్తూ తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ స్థిరీకరణకు పటిష్ఠమైన కార్యాచరణకు శ్రీకారం చుట్టాకే తెలంగాణలో వలసలు తగ్గాయి. రైతుబంధు, రైతుబీమాల భరోసా, ధీమాతో వలసవెళ్లిన కుటుంబాలు స్వగ్రామాలకు తిరిగివచ్చి వ్యవసాయం చేసుకుని సంతోషంగా జీవిస్తున్నాయి. వాస్తవానికి ఎన్నికల మ్యానిఫెస్టోలో బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్) పార్టీ రైతుబంధు ప్రస్తావన చేయలేదు. రైతుబంధు వంటి పథకం పెట్టాలని డిమాండ్ కూడా చేయలేదు. రైతుల కష్టాలు తెలిసిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎవరూ అడగకుండానే స్వయంగా రైతుల సంక్షేమం కోసం, రైతుబంధు ప్రవేశపెట్టి కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న రైతాంగానికి అండగా నిలిచారు. ఇంతటి ప్రయోజనం కలిగిన రైతుబంధును నిలిపివేయాలని తన స్వార్థం కోసం కాంగ్రెస్ కర్కశంగా ఆలోచించి ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసింది.

రైతులకు పంట సమయంలో డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నారని, పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని విష వలయంలో ఇరుక్కుంటున్నారని గ్రహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. 2018, మే 1న కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గంలోని శాలపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం 2018 నుంచి ఆగస్టు 2023 నాటికి పది విడతల్లో 68,99,076 మంది రైతులకు రూ.74,815.09 కోట్లను పంట పెట్టుబడిగా అందించింది. ఈ పథకాన్ని ఐక్యరాజ్యసమితి ప్రశంసించందంటే దీని గొప్పతనాన్ని అంచనా వేయవచ్చు. ఇటువంటి గొప్ప మానవీయ కోణం కలిగిన రైతుబంధును నిలిపివేయమని చెప్పడం కాంగ్రెస్ నాయకుల అవివేకానికి నిదర్శనం. ఈ విషయం తెలిసిన రైతాంగం కాంగ్రెస్ పార్టీ మీద ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దిగజారుడు రాజకీయాలపై తెలంగాణ వ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుబంధు కింద ఎకరానికి ప్రారంభంలో రెండు సీజన్లకు కలిపి రూ.8 వేలు ప్రభుత్వం అందించింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో దీన్ని పెంచుతూ ఎకరానికి రెండు సీజన్లకు కలిపి రూ.10 వేలు అందిస్తున్నది. తాజాగా మ్యానిఫెస్టోలో ఎకరానికి ఏటా రూ.16 వేలు ఇస్తామని ప్రకటించారు. దీనితో తమ ఓటమి ఖాయమని భావించిన కాంగ్రెస్ పార్టీ.. రైతులకు రైతుబంధు అందకుండా కుటిల యత్నాలకు పాల్పడుతున్నది.

రాష్ట్రంలో రైతుబంధు పొందుతున్న లబ్ధిదారుల సంఖ్య విషయానికి వస్తే రాష్ట్రవ్యాప్తంగా 68,99,076 మంది ఉన్నారు. లబ్ధిపొందుతున్న వారిలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన రైతులున్నారు. ఎస్సీ రైతులు 8,88,926 మంది (12.88 శాతం మంది), ఎస్టీ రైతులు 9.72.972 (14.10) శాతం మంది, బీసీ రైతులు 36,46,804 (52.86) మంది, మొత్తం ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు మొత్తం కలిపి 79.85 శాతం ఉండగా ఇతరులు 20.15 శాతం మంది ఉన్నారు. ఇలా సబ్బండ వర్గాల రైతులకు రైతుబంధును ముఖ్యమంత్రి కేసీఆర్ అందించారు. దీన్ని పరిశీలిస్తే ఏ ఒక్క వర్గానికో కాకుండా అన్ని వర్గాలకు చెందిన రైతు సంక్షేమానికి ఈ పథకం ఊతం అందించింది.

2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.10,486.36 కోట్లు, 2019-20 ఆర్థిక సంవత్సరంలో 10,532. 02 కోట్లు, 2020-21లో 14,656.01 కోట్లు, 2021-22లో 14,772.94 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 14,743.02 కోట్లు రైతుబంధు కింద రైతులకు చెల్లించారు. ఇంతటి గొప్ప పథకాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం అడ్డుకోవాలని చూస్తూ రైతాంగం జీవితాలతో ఆడుకుంటున్నది. రైతు వ్యతిరేక పార్టీగా ఇప్పటికే ప్రజల్లో ముద్ర వేసుకున్న కాంగ్రెస్ పార్టీ, రైతుబంధు నిలిపివేయాలని లేఖ రాసి మరోసారి ఆ సంగతి రుజువు చేసుకున్నది. ఆ పార్టీ తత్వమే అంత.. ఇంక దాన్నుంచి అంతకు మించి ఏం ఆశిస్తామని జనం పెదవి విరుస్తున్నారు.

## ఎటమటం



### టెలిస్కోప్ అయితే బెటర్!

ఎన్నికల కమిషన్ సందర్భోచిత నిర్ణయానికి మెచ్చుకోవాలిసిందే. రాజన్న రాజ్యం పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పార్టీకి బైనాక్యులర్ గుర్తు కేటాయించటం ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతున్నది. మొత్తం *119* సీట్లకు పోటీ చేస్తామని ఆమె ప్రకటించింది. కానీ ఇప్పటివరకు ముగ్గురే (షర్మిల, విజయమ్మ, అనిల్ కుమార్) అభ్యర్థులు దొరికారు. మరి మిగతా *116* మంది అభ్యర్థులు ఎక్కడున్నారు? అందుకేనేమో అభ్యర్థులను వెతుక్కోడానికి ఎన్నికల కమిషన్ 'బైనాక్యులర్' గుర్తు కేటాయించినట్టు ఉన్నది.



### మంత్రి దొరికిందోచ్!

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నేనంటే నేను సీఎంను అని ఓ అరడజను మంది నాయకులు పోటీ పడుతుండగా, ఎట్టకేలకూ ఒక్క మంత్రి మాత్రం దొరికారు. రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో తాను మంత్రిని అవుతానని కొండా సురేఖ ప్రకటించింది. అందరూ సీఎం క్యాండేట్లమని చెప్తుండగా, మీరేంటి? మంత్రి పదవితో సరిపెట్టుకుంటున్నారనడిగితే, దానికైతే పోటీ ఉండదని నవ్వింది. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు దాగి ఉన్నాయి.



### మైండ్ గేమ్

ఇంకా ఎన్నికల నోటిఫికేషనే జారీ కాలేదు. కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా ప్రకటించలేదు. కానీ పార్టీలో అప్పుడే సీఎం అభ్యర్థుల మధ్య ముసలం పుట్టింది. ఒకవైపు సీఎం అభ్యర్థిని ఎన్నికైన సభ్యులు, అధిష్ఠానం నిర్ణయిస్తుందని రేవంత్ రెడ్డి చెప్తూనే, మరోవైపు ఢిల్లీ వెళ్లి అక్కడ దర్గాపై చాదర్ కప్పి, సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక వస్తానని మొక్కి వచ్చారు. తాను సీఎం అయ్యాక ఏయే ఫైళ్ల మీద సంతకం పెట్టేది ప్రకటిస్తున్నారు. ఈ విషయం సీఎం రేసులో ఉన్న ఇతర నేతల వద్ద ప్రస్తావిస్తే, రేవంత్ మైండ్ గేమ్ ఆడుతున్నారంటున్నారు.



### కాక రేగాలె

బీజేపీ రెండో జాబితా ప్రకటించగానే పార్టీలో లొల్లి పుట్టాలి. టికెట్లు దక్కనివారు ఆఫీసుకు వచ్చి పెద్ద ఎత్తున గొడవకు దిగాలి. అవకాశం ఉంటే నగరంలో అక్కడక్కడా మా దిష్టి బొమ్మలు దగ్ధం చేయండి, పర్వాలేదు. ఇది బీజేపీ రాష్ట్ర ముఖ్య నేత ఒకరు తన సన్నిహితులకు ఇచ్చిన స్కెచ్‌గా ఆ పార్టీ వర్గాల సమాచారం. ఇవన్నీ చేస్తే గానీ జనంలో మన పార్టీకి క్రేజీ తగ్గలేదని, జాతీయ నేతలకు కూడా మనం బాగా కష్టపడుతున్నట్టు సంకేతాలు పంపినట్టవుతుందన్నది సదరు నేత అంచనా అంట.

- వెల్జాల